సాక్షి కామారెడ్డి

సోమవారం । 9 । డిసెంబర్ । 2024



రామనామం ఎంతో మధురం

రామనామాన్ని స్మరిస్తే మధురానుభూతి కలుగుతుందని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు.

- 9లో ▸



దినకర్మకు వస్తూ..

బంధువు దినకర్మలో పాల్గొనడానికి స్వగ్రామానికి వస్తున్న తల్లి, కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.5 /19.7

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురియవచ్చు. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

కామారెడ్డి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా లక్ష్మి!

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ధర్మగోని లక్ష్మి పేరు ఖరారు చేసినట్లు తెలిసింది. జిల్లాలో పది వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉండగా.. ఇప్పటికే తొమ్మిది మార్కెట్ కమిటీల పాలక వర్గాల నియామక ప్రక్రియ పూర్తయ్యింది. కామారెడ్డి మార్కెట్ కమిటీ పాలక వర్గాన్ని ప్రకటించాల్సి ఉంది. ఈ కమిటీ చైర్మన్ స్థానాన్ని మహిళకు కేటాయించారు. చైర్‌పర్సన్‌గా కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన ధర్మగోని లక్ష్మి పేరు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. లక్ష్మి గతంలో చిన్నమల్లారెడ్డి ఎంపీటీసీ సభ్యురాలిగా పనిచేశారు. కామారెడ్డి ఏఎంసీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల పేర్లతో కూడిన జాబితా ఇప్పటికే మార్కెటింగ్ శాఖకు చేరనట్లు తెలిసింది. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

నాగిరెడ్డిపేటలో భారీ వర్షం



నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట మండలంలో ఆదివారం సాయంత్రం సుమారు అరగంటపాటు భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురియడంతో యాసంగి సాగుకు భూములను సిద్ధం చేయడం సులువవుతుందని పేర్కొంటున్నారు.

వెటర్నరీ మెడికల్ అసోసియేషన్ కార్యవర్గం



కామారెడ్డి అర్బన్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వెటర్నరీ మెడికల్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. కామారెడ్డిలోని పర్ణిక హోటల్‌లో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సాదయ్య యాదవ్, రాష్ట్ర ప్రతినిధులు కే.రామారావు, రవీందర్‌రెడ్డి, వరప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ సాగింది. ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడిగా రాజేశ్వరరావు, అధ్యక్షుడిగా మహీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రావుల గౌతమ్, ఉపాధ్యక్షుడిగా వెంకటరావు, కోశాధికారిగా రాములు, ప్రచార కార్యదర్శిగా బాలయ్య, కార్యవర్గ సభ్యులుగా రాజు, సీహెచ్.గంగారాం, అశోక్, చంద్రశేఖర్, రామకృష్ణ ఎన్నికయ్యారని సంఘం ప్రతినిధులు తెలిపారు.




ఒడ్డెపల్లి శివారులోని వరి నారుమడి

వరి సాగుకే మొగ్గు!

- నిండుకుండల్లా జలాశయాలు
- ఆశాజనకంగా భూగర్భ జలాలు
- నారుమడులు సిద్ధం చేస్తున్న రైతులు
- సన్నాలకు బోనస్‌తో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం

అన్నదాతలు యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్నారు. చెరువులు, ప్రాజెక్టులు నిండుకుండల్లా ఉండడం, భూగర్భ జలాలు ఆశాజనకంగా ఉండడంతో వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. నారుమడులు సిద్ధం చేసుకునే పనిలో బిజీగా ఉన్నారు. ప్రభుత్వం సన్నరకం వరి ధాన్యానికి బోనస్ ఇస్తుండడంతో ఈసారి వరి సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.





నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో యాసంగి సీజన్‌లో 3.90 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో దాదాపు 2.40 లక్షల ఎకరాల్లో వరి వేస్తారని భావిస్తున్నారు. మక్క, శనగ, జొన్న, సన్‌ఫ్లవర్ తదితర ఆరుతడి పంటలకు సంబంధించి ఇప్పటికే విత్తనాలు వేశారు. వరి సాగు చేసే రైతులు వరి నారుమడులు పోస్తున్నారు.

సాగునీటికి ఢోకా లేనట్లే..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వరప్రదాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టు 17 టీఎంసీల నీటిమట్టంతో నిండుకుండలా ఉంది. ఈ ప్రాజెక్టు ఆయకట్టు కింద ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో యాసంగి సీజన్‌లో 1.25 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని అంచనా వేస్తున్నారు. బాన్సువాడ ప్రాంతంలోని బాన్సువాడ, నస్రుల్లాబాద్ మండలాల్లో ఇప్పటికే వరి నారుమడులు పోశారు. పది పదిహేనే రోజుల్లో నాట్లు కూడా మొదలుకానున్నాయి. మిగతా ప్రాంతాల్లో నారుమడులు పోస్తున్నారు. కౌలాస్ నాలా ప్రాజెక్టు కింద 9 వేల ఎకరాల్లో, పోచారం ప్రాజెక్టు కింద 11 వేల ఎకరాల్లో వరి సాగవనుంది. కాగా జిల్లాలో వెయ్యికిపైగా ఉన్న చెరువులు, కుంటల్లో నీరు పుష్కలంగా ఉండడంతో వాటి కింద ఆయకట్టులోనూ వరి సాగుచేయనున్నారు. జిల్లాలో బోరు బావుల కింద లక్షకుపైగా ఎకరాలలో పంటలు సాగవుతాయి. ఇందులో ఎక్కువ విస్తీర్ణం వరి పంటనే ఉంటుంది. మిగతాది ఆరుతడి పంటలు, చెరకు సాగు చేయనున్నారు.

8.43 మీటర్ల లోతులోనే..

ప్రస్తుతం భూగర్భ జలమట్టం ఆశాజనకంగా ఉన్న నేపథ్యంలో రైతులు బోర్లపై ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలో సరాసరిన 8.43 మీటర్ల లోతులో భూగర్భ జలాలున్నాయి. దీంతో ఈ సీజన్‌లో సాగునీటి కష్టాలు రాకపోవచ్చని భావిస్తున్నారు.

నిజాంసాగర్ ఆయకట్టులో నాట్లకు సన్నద్ధం..

ప్రభుత్వం సన్న రకాల సాగును ప్రోత్సహిస్తుండడంతో ఈసారి వరి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. సాధారణంగా యాసంగిలో దొడ్డు రకాలే ఎక్కువగా సాగయ్యేది. ప్రభుత్వం సన్న రకం వడ్లకు ప్రభుత్వం క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్ ఇస్తోంది. ఈ నేపథ్యంలో ఎక్కువ మంది రైతులు సన్నరకం వరి సాగు చేయడానికి ఆసక్తి చూపే అవకాశాలున్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, నిజాంసాగర్ తదితర మండలాల్లో రైతులు సన్నాలు సాగు చేయడానికి ఇప్పటికే నారుమడులు పోశారు. కొన్నిచోట్ల నాట్లకూ సిద్ధమవుతున్నారు. వారం పది రోజుల్లో నాట్లు షురూ అవుతాయని భావిస్తున్నారు. దిగుబడి తగ్గినా బోనస్ కలిసివస్తుందన్న ఆశతో బోర్లు, బావుల వద్ద కూడా రైతులు సన్నాలు సాగు చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

అసెంబ్లీలో గళమెత్తి న్యాయం చేయాలి

- ఎమ్మెల్యేకు సర్వశిక్ష ఉద్యోగుల వినతి
- మూడో రోజు దీక్షలో ఉద్యోగులు



కేవీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

కామారెడ్డి టౌన్: తమ ఉద్యోగాల క్రమబద్ధీకరణ కోసం అసెంబ్లీలో గళమెత్తాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సర్వశిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న తాము శ్రమ దోపిడీకి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారని పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో తమ క్రమబద్ధీకరణ అంశంపై మాట్లాడి తమకు న్యాయం జరిగేలా చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు వాసంతి, ప్రతినిధులు శైలజ, లింగం, కాళిదాసు, దినేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో బ్రహ్మానందం సందడి



బ్రహ్మానందంతో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ కుటుంబ సభ్యులు

కామారెడ్డి టౌన్: ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందం ఆదివారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ ఇంటికి వచ్చారు. బ్రహ్మానందం వచ్చారని తెలియడంతో అభిమానులు, స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆయనతో సెల్ఫీలు, ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ కుటుంబ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు.

'ప్రజల సౌకర్యార్థం కొత్త అంబులెన్సులు'



మద్నూర్‌లో 108 అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

మద్నూర్: ప్రజలకు అత్యవసర సమయాల్లో సత్వర వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి 108 నూతన అంబులెన్స్‌లను మంజూరు చేశారని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం 108 అంబులెన్స్‌కు పూజలు చేసి వాహనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సాయిలు, నాయకులు హన్మండ్లు స్వామి, సాయి పటేల్, శీను పటేల్, గోపి, ప్రజ్ఞ కుమార్ పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట మండలానికి..

నాగిరెడ్డిపేట: ఎట్టకేలకు నాగిరెడ్డిపేట మండలానికి అంబులెన్స్ కేటాయించారు. ఇన్నాళ్లు మండలంలో అంబులెన్స్ లేకపోవడంతో చాలామంది క్షతగాత్రులు సకాలంలో వైద్యం అందక ప్రాణాలను కోల్పోయారు. ఇన్నాళ్లు నాగిరెడ్డిపేట మండల పరిధిలో ఎక్కడైనా ప్రమాదాలు జరిగిన సందర్భాలలో ఎల్లారెడ్డి, లింగంపేట మండలాల నుంచి అంబులెన్స్‌లు వచ్చి క్షతగాత్రులను ఆస్పత్రులకు చేర్చేవి. కొన్ని సందర్భాలలో మెదక్ జిల్లా నుంచి సైతం అంబులెన్స్ వచ్చేది. ప్రస్తుతం అంబులెన్స్ కేటాయించడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తాడ్వాయికి కొత్త అంబులెన్సు

తాడ్వాయి: మండలానికి నూతన 108 అంబులెన్స్ వాహనాన్ని ప్రభుత్వం కేటాయించింది. తాడ్వాయిలోని జీపీ కార్యాలయంలో సేవలకు సిద్ధంగా ఉంచారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై ఫిర్యాదు



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న సభ్యులు

కామారెడ్డి టౌన్: వెలమ సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా వెలమ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆదివారం కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు గంప్ర మధుసూదన్‌రావు, ఐలేని రాజేశ్వరరావు, రాజ్‌గంభీర్ రావు, మహేందర్‌రావు, తిరుపతిరావు, శ్రీనివాస్‌రావు, ప్రశాంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సెరీ కల్చర్‌తో సిరులు 'పట్టు'!

- ప్రోత్సహిస్తున్న అధికారులు
- రైతుల్లో పెరుగుతున్న ఆసక్తి



మాచారెడ్డిలో మల్బరీ తోటను పరిశీలిస్తున్న రైతులు

మాచారెడ్డి: ఒకప్పుడు రైతులు సంప్రదాయ పంటల సాగుకే మొగ్గు చూపేవారు. ఇప్పుడిప్పుడే వారిలో మార్పు వస్తోంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చని అధికారులు చెబుతుండడంతో కొందరు పట్టు పరిశ్రమ వైపు మళ్లుతున్నారు. ప్రస్తుతం మాచారెడ్డి మండలంలో 25 ఎకరాల్లో సెరీకల్చర్ సాగవుతోంది.

ఉపాధి అవకాశాలు

మాచారెడ్డి మండలానికి చెందిన ఎండీ హర్షద్ ఆరు ఎకరాలలో మల్బరీ తోటలు పెంచుతున్నాడు. ఏటా ఏడు నుంచి ఎనిమిది సార్లు 'పట్టు' పంట చేతికి వస్తుందని పేర్కొంటున్నాడు. ఇలా ఏడెనిమిది సార్లు 'పట్టు' తీసి రాష్ట్రంలోని అత్యధిక పట్టు ఉత్పత్తి సాధించిన రైతుగా ఈయన గుర్తింపు తెచ్చుకున్నాడు. బీబీపేట మండలానికి చెందిన కుర్ల దేవయ్య సైతం మల్బరీ సాగుతో మంచి లాభాలు ఆర్జిస్తున్నాడు. మాచారెడ్డి మండలంలోని చెరువు కొమ్ము తండాకు చెందిన కల్యాణ్ నాయక్ ఇటీవల 6 ఎకరాల్లో మల్బరీ సాగు మొదలుపెట్టాడు. ఇలా జిల్లాకు చెందిన రైతులు సెరీకల్చర్‌తో ఉపాధి అవకాశాలు పెంపొందించుకుంటున్నారు.

అవగాహన కల్పిస్తూ..

మల్బరీ సాగును ప్రోత్సహించేందుకు పట్టు పరిశ్రమ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మాచారెడ్డి మండలానికి చెందిన పలువురు రైతులు పట్టు పురుగుల పెంపకంలో అత్యధిక లాభాలను గడిస్తూ ముందుకు సాగుతున్నారు. వీరి విజయ గాథలను జిల్లావ్యాప్తంగా ప్రచారం చేస్తున్నారు. ఇటీవల కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాచారెడ్డి గ్రామాన్ని సందర్శించి పట్టు రైతులు సాగు చేస్తున్న మల్బరీ తోటలను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా మల్బరీ సాగును ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు.

75 శాతం సబ్సిడీ..

బహుళ వార్షిక పంట అయిన మల్బరీ.. సుమారు 30 ఏళ్లపాటు కోతకు వస్తూనే ఉంటుంది. ఏటా ఆరు నుంచి ఎనిమిది పంటల వరకు అందిస్తుంది. మొదటి సంవత్సరం మూడు పంటల వరకు వస్తాయని పట్టు పరిశ్రమ శాఖ అధికారులు చెబుతున్నారు. మూడో సంవత్సరం నుంచి ఏటా ఆరునుంచి ఎనిమిది పంటలు వస్తాయంటున్నారు. దీనికి అనుగుణంగా పట్టు పురుగులను పెంచడం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు అర్జించడానికి అవకాశం ఉంటుంది. ఒక్కసారి నాటితే సుదీర్ఘ కాలం పాటు దిగుబడి వచ్చే అవకాశాలు ఉండడంతో పెట్టుబడి కూడా తగ్గుతుంది. దానికి తోడు సూక్ష్మ నీటి పారుదల సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకుంటే తక్కువ నీటితో కూడా మల్బరీ పంట పండించవచ్చు. సెరీ కల్చర్ ను ప్రభుత్వాలూ ప్రోత్సహిస్తున్నాయి. మల్బరీ సాగుకు ముందుకు వచ్చే వారికి సబ్సిడీలు అందిస్తున్నాయి. రైతులు పట్టుపురుగుల పెంపకం కోసం షెడ్డు నిర్మించుకుంటే కేంద్ర ప్రభుత్వం 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం సహాయాన్ని అందిస్తాయి. రైతు 25 శాతం భరిస్తే సరిపోతుంది. దీనిపై పట్టు పరిశ్రమ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

నేటినుంచి పట్టు పరిశ్రమపై అవగాహన సదస్సు

భిక్కనూరు: జంగంపల్లి గ్రామంలోని రైతు వేదికలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు పట్టు పరిశ్రమ, మల్బరి సాగుపై అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఐలయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జ్యోతితోపాటు నిపుణులు డాక్టర్ వినోద్‌కుమార్ యాదవ్, డాక్టర్ రాఘవేంద్ర పాల్గొని పట్టు పరిశ్రమ, మల్బరి సాగుపై అవగాహన కల్పిస్తారని, అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తారని పేర్కొన్నారు. ఆసక్తిగల రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పట్టుతో అధిక లాభాలు



సంప్రదాయ పంటల కంటే పట్టుతోనే అధిక లాభాలు పొందవచ్చు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయి. పెట్టుబడిలో 75 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే భరిస్తాయి. ఈ పంట సాగుపై రైతులు దృష్టి సారించాలి.

– జ్యోతి, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి

రైతుబీమా.. దక్కని ధీమా

- గతంలో పదిహేను రోజుల్లోగా క్లెయిమ్ చెల్లింపులు
- ప్రస్తుతం నెలలు గడుస్తున్నా తప్పని ఎదురుచూపులు
- ఇబ్బంది పడుతున్న బాధితులు



కామారెడ్డి క్రైం: ఏ కారణంతోనైనా రైతు చనిపోతే ఆ కుటుంబం వీధిన పడకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం రైతు బీమా పథకానికి శ్రీకారం చుట్టింది. మొదట్లో ఈ పథకం సజావుగా సాగినా ఇటీవలి కాలంలో బీమ క్లెయిమ్‌లలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రకరకాల కొర్రీలతో చాలామందికి క్లెయిమ్ అందడం లేదు.

జిల్లాలో 3.14 లక్షల మంది రైతులు ఉన్నారు. 59 ఏళ్లలోపు రైతులకు రైతుబీమా పథకం వర్తిస్తుంది. దీని ప్రకారం జిల్లాలో రైతు బీమాకు 1,96,554 మంది రైతులు అర్హులు. ఏటా ఆగస్టు 14 నుంచి ఏడాది కాలానికి రైతు బీమా ప్రీమియంను ప్రభుత్వం బీమా కంపెనీకి చెల్లిస్తుంది. రైతు ఏ కారణంతో చనిపోయినా నామినీకి రూ. 5 లక్షల పరిహారం అందించాల్సి ఉంటుంది. తంలో ఎవరైనా రైతు చనిపోతే మరణ ధ్రువీకరణ పత్రం, నామినీ ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలతో దరఖాస్తు చేసుకుంటే 15 రోజుల్లోగా క్లెయిమ్ డబ్బులు చెల్లించేవారు.

కొర్రీలతో తీవ్ర జాప్యం..

రైతు బీమా పథకంలో నమోదు చేసేటప్పుడు వ్యవసాయశాఖ అధికారులు రైతు వివరాలతో పాటు నామినీ వివరాలను కూడా ఆధార్ కార్డుతో సహా నమోదు చేస్తారు. గతంలో డెత్ సర్టిఫికెట్, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు ఇస్తే సరిపోయేది. ఇటీవల వాటితో పాటు ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్, ప్రమాదాల కేసుల్లో ఫైనల్ ఎఫ్ఐఆర్ రిపోర్టు, ఇతర ఎన్‌వోసీలు అడుగుతున్నారు. భార్యాభర్తలు, సంతానం విషయంలో చిక్కులు తక్కువ. అదే అన్నదమ్ములు, అక్కా చెల్లెళ్లు నామినీగా ఉన్న కేసులను ధ్రువపత్రాలు, ఎన్‌వోసీల పేరిట పెండింగ్‌లో పెడుతున్నారు. నామినీ కూడా చనిపోతే ఆ కుటుంబంలోని వారసులకు ఇవ్వాలంటే మరిన్ని చుక్కలు చూపిస్తున్నారని బాధితులు చెబుతున్నారు. ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్‌లో ఇద్దరు ఉద్యోగుల షూరిటీ ఉంటుంది. షూరిటీ ఇచ్చిన వారి సాలరీ పే స్లిప్స్ తీసుకురావాలనే నిబంధనతో చాలామంది ఇబ్బందిపడుతున్నారు. ఫైనల్ ఎఫ్ఐఆర్ రావాలంటే కనీసం 3 నెలలైనా సమయం పడుతుంది. కార్యాలయాల చుట్టూ తిరిగి అడిగినవి అన్నీ తెచ్చి ఇచ్చినా నెలల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యుడు మరణించి ఎనిమిది నెలలైనా బీమా క్లెయిమ్ అందనివారున్నారు. ఉన్నతాధికారులు స్పందించి త్వరగా రైతుబీమా డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పెండింగ్‌లో 151 దరఖాస్తులు

జిల్లాలో ఈ ఏడాది వివిధ కారణాలతో 418 మంది రైతులు చనిపోయారు. వ్యవసాయ శాఖ ద్వారా సదరు బీమా కంపెనీకి అన్ని డాక్యుమెంట్‌లు సమర్పిస్తూ 407 దరఖాస్తులు అందించారు. ఇందులో 256 మంది రైతులకు బీమా చెక్కులు అందాయి. మిగిలినవారికి నెలలు గడుస్తున్నా డబ్బులు రావడం లేదు. బీమా కంపెనీ కొర్రీలతో ఇంకా 151 దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి.

ఎనిమిది నెలలుగా తిరుగుతున్నా..



మా అల్లుడు చనిపోయి ఎనిమిది నెలలు అయ్యింది. రైతు బీమా డబ్బులకోసం దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా రావడం లేదు. అన్ని పత్రాలు ఇచ్చినా క్లెయిమ్ కావడం లేదు. అధికారులు స్పందించి బీమా డబ్బులు వచ్చేలా చూడాలి.

– కెతావత్ కిషన్, వెంకటాపూర్ తండా, గాంధారి

మా దగ్గర పెండింగ్‌లో లేవు

రైతుబీమాకు సంబంధించి వ్యవసాయ శాఖ వద్ద దరఖాస్తులు పెండింగ్‌లో లేవు. బీమా కంపెనీ వారి పాలసీకి అనుగుణంగా చెక్కులు క్లెయిమ్ చేస్తుంటాయి. మా అధికారులు మాత్రం వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నారు. బీమా డబ్బులు తొందరగా వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

– తిరుమల ప్రసాద్, డీఏవో, కామారెడ్డి

క్లుప్తంగా

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



కామారెడ్డి అర్బన్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి రూ.40 వేల ఆర్థిక సహాయం అందజేశారు మిత్రులు. పట్టణ పరిధిలోని టేక్రియాల్‌కు చెందిన మేడు దల రాజు గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదం లో మృతి చెందారు. దీంతో ఆయన చదువు కున్న బ్రాహ్మణపల్లి ఉన్నత పాఠశాల పదవ తరగతి (2003–04) బ్యాచ్ విద్యార్థులు ఆది వారం రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని రాజు కుటుంబ సభ్యులకు అందజేశారు.

బాల్య మిత్రుడి కుటుంబానికి..



మాచారెడ్డి: వారితో కలిసి చదువుకున్న మిత్రుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాల్యస్నేహితులు చేయి చేయి కలి పారు. రూ. 50 వేలు సమకూర్చి ఆ కుటుంబా నికి అందజేసి మేమున్నామని భరోసా ఇచ్చారు. వివరాలు.. మండలంలోని చుక్కా పూర్ గ్రామ మాజీ ఉప సర్పంచ్ ఓడపల్లి నర్సింగరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృ తి చెందారు. దీంతో చుక్కాపూర్ ఉన్నత పాఠ శాలలో 1986–87 పదో తరగతి బ్యాచ్ మిత్రులు మృతుడి కుటుంబానికి ఆదివారం రూ.50 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను అంద జేశారు.

స్నేహితుడి కుమార్తె వివాహానికి..

రాజంపేట: తలమడ్ల పాఠశాలకు చెందిన 2002 బ్యాచ్‌కు చెందిన స్నేహితులు, తమ తోటి మిత్రుడైన కే.శే నర్సింలు(పొందుర్తి) కుమార్తె రుచిత వివాహానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసి అండగా నిలిచారు. శివాయిపల్లి, పొందుర్తి, తలమడ్ల గ్రామాలకు చెందిన వీరందరు తలమడ్ల ఉన్నత పాఠశా లలో పదవ తరగతి వరకు కలిసి చదువుకు న్నారు.

రికవరీ సెల్‌ఫోన్ అప్పగింత

మాచారెడ్డి:మండలంలోని ఎల్లంపేట గ్రామాని కి చెందిన దండ్ల కొమురయ్య ఇటీవల తన సె ల్‌ఫోన్ను పోగొట్టుకున్నారు.ఈ విషయమై పో లీసులకు ఫిర్యాదు చేయగా..మాచారెడ్డి ఎస్సై అనిల్ సీఈఐఆర్ ద్వారా రికవరీ చేశారు.ఆఫో న్‌ను ఆదివారం కొమురయ్యకు అప్పగించారు.

మదన్‌పల్లివాసికి డాక్టరేట్



మాక్లూర్: మండలంలోని మదన్‌పల్లికి చెందిన ఎస్ రామాచారికి ఇంగ్లిష్ విభాగంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పీహెచ్‌డీ)ని గురువారం ప్రదానం చేశారు. 'అన్‌హర్డ్ వాయిసెస్ ఎస్టడీ ఆఫ్ దళిత్ లైఫ్ నారెటివ్స్ ఆఫ్ పీఆర్ వెంకటస్వామి, వైబి సత్యనారాయణ, సుజాత గిడ్ల అనే అంశంపై ఓయూ ప్రొఫెసర్ నవీన్‌సోడ మార్గదర్శకత్వం లో పరిశోధన పూర్తి చేశారు. ప్రస్తుతం రామాచారి జిల్లా కేంద్రంలోని టీజీఎంఆర్ఎ స్‌లో ప్రోస్టు గ్రాడ్యుయేట్ టీచర్‌గా పనిచేస్తు న్నాడు. డాక్టరేట్ పొందడంపై పలువురు అభి నందనలు తెలిపారు.

'మధ్యాహ్నం'లో నాణ్యత కరువు

- ఒక్కో నెల ఒక్కో రకమైన బియ్యం సరఫరా
- ముద్దలు, ఉండలుగా మారుతున్న అన్నం
- అయిష్టంగానే తింటున్న విద్యార్థులు

బాన్సువాడ రూరల్: ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలు, గురుకుల పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యం తో అన్నం పెడ్తున్నామని అధికారులు చెబుతు న్నారు. కాని పౌరసరఫరాల శాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగా పలుమార్లు నాణ్యత లేని బియ్యం సరఫరా అవుతున్నాయి. ఇటీవల పలు



మోడల్ స్కూల్‌లో ముద్దగా మారిన అన్నం

ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, సంక్షేమ వసతిగృహా లకు అధికారులు కొత్త బియ్యం సరఫరా చేశారు. బియ్యం భౌతికంగా చూడటానికి సన్నగా, తెల్లగా కన్పిస్తున్నాయి. తీరా వంట చేస్తే బియ్యం పాత్రలో కిందికి కూర్చుండిపోయి పైకి బుడగలుగా ఎగు రకుండా అన్నం ముద్దగా, గడ్డలు గడ్డలుగా మారు తోంది. సరిగ్గా ఉడకటం లేదు. ఉడికించాలని ప్రయత్నిస్తే ఉప్మాలా ఉండలుగా మారిపోతోందని ఏజెన్సీ నిర్వాహకులు వాపోతున్నారు. ఎంత ప్రయ త్నించినా అన్నం ఉడికీ ఉడకకుండా ఉండటం, ముద్దగా మారడంతో వంట ఏజెన్సీ నిర్వాహకులు, వంటమనుషులు తీవ్ర ఇబ్బందులకు గురువుతు న్నారు. అన్నం ముద్దగా మారుతుండటంతో విద్యా ర్థులు అయిష్టంగా భోజనం చేస్తున్నారు. కొందరు తినలేక పారేస్తున్నారు. ముద్ద అన్నం కావడంతో కూరలు ఎక్కువగా వండాల్సి వస్తోంది. అన్నంతో పాటు పప్పుచారు లేకుంటే అన్నం నోట్లో దిగడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. పంపిణీ చేసిన కొత్తబియ్యంలో నూక శాతం కూడా ఎక్కువగా వస్తుండటంతో ఉండలు కట్టిన ముద్ద అన్నం తిన డానికి విద్యార్థులు విముఖత చూపుతున్నారు.

మారిన మెనూలో బిర్యానీ..

తెలంగాణ ప్రభుత్వం 40 శాతం మెస్‌చార్జీలను పెంచడంతో పాటు మెనూలోనూ సమూల మార్పులు చేశారు. మైనార్టీ గురుకుల విద్యార్థులకు ప్రతి ఆదివారం చికెన్ బిర్యాని చేయాలని మెనూలో చేర్చారు. వైట్ రైస్ చేస్తేనే ముద్ద అవుతున్న బియ్యంతో బిర్యానీ చేసేది ఎలా అని వంట మను షులు జుట్టు పీక్కుంటున్నారు. బియ్యం మినహా కూరగాయలు, గుడ్లు, చికెన్, పాలు, పప్పులు ఇతర కిరాణా వస్తువులు ప్రతి ఏటా కలెక్టరేట్‌లో టెండర్ నిర్వహించి వారి ద్వారానే సరుకులు కొనుగోలు చేస్తున్నారు. పంపిణీ చేసిన సరుకుల్లో నాణ్యతాలోపం ఉంటే టెండర్‌దారును బాధ్యుడిని చేస్తూ చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంది. బియ్యం విషయంలో మాత్రం అలా లేదు. పౌరసర ఫరాల శాఖ అధికారులను రైస్‌మిల్లర్లు ప్రసన్నం చేసుకుని నాణ్యతలేని బియ్యం ఎఫ్‌సీఐకి అక్కడి నుంచి ఎంఎల్ఎస్ పాయింట్‌లకు చేరిపోతున్నా యనే ఆరోపణలున్నాయి.దీంతో ఒ క్కోసారి ఒక్కో రకమైన బియ్యం సరఫరా అవుతున్నాయి. ఒక్కోసారి సరఫరా అయిన బియ్యంలో నూకలు, చెత్తాచెదారంతో నాణ్యతలోపంగా ఉంటున్నాయి. ఇతర సరుకుల మాదిరి బియ్యం కూడా టెండర్ ద్వారా ఆయా రైస్‌మిల్లర్లకు కేటాయిస్తే సరుకులో నాణ్యతతో పాటు పారదర్శకత ఉండే అవకాశం ఉంది. ప్రభుత్వం ఆదిశగా ఆలోచించాల్సిన అవ సరం ఉంది.

ఇంటినుంచి బాక్సులు

పాఠశాలల్లో విద్యార్థుల కోసం వండుతున్న మధ్యాహ్న భోజనం ఉండలుగా ఉంటుండటం తో పలు చోట్ల విద్యార్థులు ఇంటి నుంచి బాక్సులు తెచ్చుకుంటున్నారు. ఇక వసతి గృ హాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ గురుకుల పాఠశాలలు, మోడల్ స్కూల్, కేజీ బీవీ హాస్టళ్లల్లో ఉండి చదువుకునే విద్యార్థులు ఎవరికీ చెప్పుకోలేక అదే అన్నం అయిష్టంగా తింటున్నారు. ఎఫ్‌సీఐ ద్వారా బియ్యం సర ఫరా జరగడం, పౌరసరఫరాలశాఖ అధికారులు తనిఖీలు చేసి అనుమతించిన బియ్యం కావడంతో ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్‌లు, వార్డెన్‌లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడానికి వెనుకడుగు వేస్తున్నారు.

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దు

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో ఆదివారం ఎస్సై మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. కందర్‌పల్లి, అంబేడ్కర్ చౌరస్తాలలో వాహ నాలు తనిఖీ చేసి డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు లేనివారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భం గా ఎస్సై మాట్లాడుతూ.. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. డ్రైవర్ పక్కన సీట్లను తొలగించాలని, అతివేగంగా వెళ్లవద్దన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమా దాలు జరగవన్నారు. డ్రైవర్లు, వాహనచోదకులకు అవగాహన కల్పించారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామా రెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో ఆదివారం పో లీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. పలువురికి జరిమానాలు విధించారు. పెండింగ్ చలానాలున్న వాహనాలకు ఆన్‌లైన్‌లో డబ్బులు కట్టేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మద్యం సేవిం



బిచ్కుందలో పట్టుకున్న వాహనాలు

చి వాహనాలను నడిపినట్లయితే కేసులు నమోదు చేస్తామన్నారు. చిన్న పిల్లలకు వాహనాలను ఇవ్వవ ద్దని, ఇచ్చినవారు, నడిపించిన వారిపై కేసులు నమోదు చేస్తామనిహెచ్చరించారు.



అ'పూర్వ' సమ్మేళనం

కొత్తాబాదిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు

బాన్సువాడ రూరల్: కొత్తాబాది జెడ్పీహైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా 2004–05 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు నాడు పాఠాలు నేర్పిన ఉపాధ్యాయు లను ఘనంగా సన్మానించి దీవెనలు పొందారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

కామారెడ్డి క్రైం: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన కామారెడ్డి మున్సిపల్ పరి ధిలోని అడ్లూర్‌లో ఆదివారం ఉదయం చోటు చేసు కుంది. వివరాలిలా ఉన్నాయి. గర్గుల్‌కు చెందిన గం గపురం లింగయ్యకు భార్య పోచవ్వ(30), ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు సంచార జీవనం గడు పుతూ భిక్షాటన, కూలీ పని చేస్తుంటారు. కొన్ని రో జుల క్రితం అడ్లూర్ గ్రామానికి చివరన ప్లాస్టిక్ కవ ర్‌తో గుడారం వేసుకుని ఈ ప్రాంతంలో భిక్షాటన, పనులు చేసుకుంటున్నారు. ఆదివారం ఉద యం 9 గంటల ప్రాంతంలో పోచవ్వ గుడారంలో మృతి చెంది ఉంది. స్థానికుల ద్వారా విషయం తెలుసు కున్న ఆమె తండ్రి కోట పోచయ్య, బంధువులు గ్రా మానికి చేరుకున్నారు. మృతదేహంపై గాయాలు కనిపించడంతో భర్త లింగయ్యనే హత్య చేసి ఉం టాడని అనుమానం వ్యక్తం చేస్తూ దాడి చేయ



విచారణ చేపడుతున్న ఎస్సై రాజు

బోయారు. దీంతో అతను అక్కడి నుంచి పారిపో యినట్లు స్థానికులు తెలిపారు. శనివారం సాయం త్రం తాను భిక్షాటనకు వెళ్తున్నప్పుడు తల్లిదండ్రులు గొడవ పడుతున్నారని, తిరిగి వచ్చే సరికి తల్లి పోచ వ్వ చనిపోయి ఉందని మృతురాలి పెద్ద కుమారు డు దుర్గేశ్ తెలిపినట్లు బంధువులు చెబుతున్నారు. శనివారం రాత్రే ఘటన జరిగినట్లు భావిస్తున్నారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

డీజిల్ చోరీ కేసులో నిందితుల పట్టివేత

డిచ్‌పల్లి: మండలంలోని సుద్దపల్లి, ఖిల్లా వద్ద ఉన్న సెల్‌టవర్ల జనరేటర్ల నుంచి డీజిల్‌ను దొంగతనం చేసిన ఇద్దరు నిందితులను ఆదివారం పట్టుకొన్నట్లు సీఐ మల్లేశ్, ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. సీఐ కార్యాలయం లో నిందితుల వివరాలను సీఐ వెల్లడించారు. ఇంద ల్వాయి మండలానికి చెం



నిందితులను వివరాలను వెల్లడిస్తున్న సీఐ

దిన తిర్మన్‌పల్లి గ్రామస్తులు మహమ్మద్ సమీర్, కలి గోట్ సాకలి కార్తీక్ మరో మైనర్‌తో కలిసి డిచ్‌పల్లి, ఇం దల్వాయి, జక్రాన్‌పల్లి, సదాశివనగర్ మండలాల్లో సెల్‌టవర్ల జనరేటర్ల నుంచి డీజిల్‌ను దొంగతనం చేసి ఇతరులకు విక్రయించే వారు. ఇప్పటి వరకు 900 లీటర్ల డీజిల్‌ను దొంగలించారని అన్నారు. నిందితు లను కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

బైక్‌ల చోరీ కేసులో..

ఖలీల్‌వాడి: జల్సాలకు అలవాటు పడి బైక్‌ల ను చోరీలకు పాల్పడే నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ హెచ్‌వో రఘుపతి ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నవీపేట్ మండలం బినోలా గ్రామానికి చెందిన ఎరుకుల ప్రశాంత్ అనే యువకుడు బైక్‌ల చోరీలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందడంతో అతనిపై నిఘా ఉంచి పట్టుకున్నట్లు తెలిపారు. విచార ణలో అతను జల్సాలకు అలవాటు పడి బైక్‌లను చోరీలకు పాల్పడుతున్నట్లు నేరం అంగీకరించాడు. అనంతరం పోలీసులు మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని పట్టుకున్న ఏఎస్సై షకీల్,



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

పీసీలు గంగారాం, రవిలను పోలీసు ఉన్నతాధికా రులు అభినందించారు.

స్టడీ టూర్‌కు ఏఎంసీ పాలకవర్గం

వేల్పూర్: వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమి టీ పాలకవర్గ సభ్యులు ఆదివారం స్టడీ టూర్‌కు బయ లుదేరి వెళ్లారు.ఆంధ్రప్రదేశ్, తమిళనా డు రాష్ట్రాల్లోని ప్రముఖ మార్కెట్‌లను సందర్శిస్తామని పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, వైస్‌చైర్మన్ గడ్డం నర్సా రెడ్డి, డైరెక్టర్లు కలిసి స్టడీ టూర్‌కు వెళ్లారు.

రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌కు క్రీడాకారుల ఎంపిక



మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో విజేతలు



జి.లక్ష్మీనారాయణ

కామారెడ్డి అర్బన్: మాస్టర్స్ అథ్లెటిక్స్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యం లో ఆదివారం స్థానిక ఇం దిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన వివిధ క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన 25 మందిని క్రీడాకారులను రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక చేశారు. ఎంపికైన వారికి అసోసియేషన్ తరఫున పతకాలను అందజేశారు. పదివేల మీటర్ల పరు గులో అత్యంత ప్రతిభ కనబర్చిన గెరిగంటి లక్ష్మీనా రాయణ(అండర్ –45 విభాగం)ను ఎంపిక చేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రంజిత్‌మో హన్, ప్రధాన కార్యదర్శి డి.నరేష్, గౌరవ అధ్యక్షుడు రాజన్న, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంపికైంది వీరే..

గెరిగంటి లక్ష్మీనారాయణ, ప్రవీణ్ కుమార్, కేపీ అనిల్‌కుమార్,అతీకుల్లా,చంద్రశేఖర్,నరేష్, మ హేందర్‌చారి, జి.నవీన్, రాజేందర్, సతీష్, నరేష్ రెడ్డి, సబాత్ కృష్ణ, నరేందర్, కె.రవి, అనిల్‌కుమార్, రాజేందర్, రవీందర్‌రెడ్డి, రాజశేఖర్, సురేష్, సం తోష్, సునీల్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, శివాజీ, ఎం.సుమత, ఎం.సుధలు ఎంపికయ్యారు.

రాష్ట్ర స్థాయి సీనియర్ కబడ్డీ జట్టుకు పేట్‌సంగెం విద్యార్థిని



గాంధారి(ఎల్లారెడ్డి): రాష్ట్ర స్థాయి మహిళల సీనియర్ కబడ్డీ జట్టుకు మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పేట్‌సంగెం విద్యార్థిని నేనావత్ సుచరిత ఎంపికై నట్లు పీఈటీ లక్ష్మణ్ ఆదివారం తెలిపారు. ఈ నెల 5న కామారెడ్డి పట్టణంలో జరిగిన పోటీల్లో సుచరిత ప్రతిభ కనబర్చి నిర్వాహకుల దృష్టిని ఆకర్షించిం దని తెలిపారు. ఈ నెల 8 నుంచి 10 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో సుచరిత ప్రాతినిధ్యం వహిస్తుందని పీఈటీ తెలిపారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రదర్శనకు ..



ఎంపికైన భిక్కనూరు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు

భిక్కనూరు: రాష్ట్రస్థాయి సైన్స్ ప్రదర్శనకు భిక్క నూరు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికై నట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీనాథ్ తెలిపారు. పాఠశా లకు చెందిన స్ఫూర్తి, సాయి శ్రేయస్‌లు సహజ వ్యవసాయంతో పాటు న్యూట్రిషన్‌పై బాన్సువా డలో నిర్వహించిన జిల్లా సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శిం చారు. వీరి ప్రదర్శనను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులను ఎంఈవో రాజగం గారెడ్డి, సైన్స్ అధ్యాపకులు తమ్మళి రాజు, సరితలు అభినందించారు.

బీసీ హాస్టల్ విద్యార్థులకు స్పోర్ట్స్ మీట్ క్రీడా పోటీలు



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

కామారెడ్డి టౌన్: జిల్లాలోని 26 బీసీ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా ఆదివారం క్రీడా పోటీలను నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళా శాల, సరస్వతి శిశుమందిర్ మైదానాల్లో కబడ్డీ, ఖోఖో తదితర క్రీడా పోటీలను నిర్వహించి విజే తలకు బహుమతులను అందజేశారు. హాస్టల్ వెల్ఫేర్ యూనియన్ అధ్యక్షుడు చక్రధర్, వార్డెన్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

దినకర్మకు వస్తూ.. అనంత లోకాలకు

- రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడు మృతి
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు

భిక్కనూరు/ బాన్సువాడ: మృతి చెందిన బంధువు దినకర్మకు వస్తున్న తల్లీకుమారులు రోడ్డు ప్రమా దంలో మృతి చెందిన ఘటన భిక్కనూరు మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరా లిలా ఉన్నాయి. బాన్సువాడ పట్టణానికి చెందిన కంచర్ల అక్షయ్‌రెడ్డి(28) పేటీఎం కంపెనీలో మార్కె టింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ హైదరాబాద్‌లోని అంబారిపేటలో కుటుంబంతో కలిసి నివసిస్తు న్నాడు. పది రోజుల క్రితం వారి బంధువు బాన్సు వాడలో మృతి చెందగా ఆదివారం చేపట్టే దినకర్మ కార్యక్రమానికి అక్షయ్‌రెడ్డి కారులో తనతో పాటు తల్లి లక్ష్మి(49), అమ్మమ్మ కొర్ల భూమవ్వ, మేన మామ రాజేశ్వర్‌రెడ్డితో కలిసి బాన్సువాడకు ఉదయం హైదరాబాద్ నుంచి వస్తున్నారు. ఉదయం 6.50 నిమిషాల ప్రాంతంలో పొగమంచు ఉన్నందున రోడ్డు కనిపించక భిక్కనూరు సమీపం లోని జాతీయ రహదారిపై నిలిచి ఉన్న లారీని ఢీకొ న్నాడు. దీంతో కారు ముందరి భాగం నుజ్జునుజ్జు అయ్యింది. కారు నడుపుతున్న అక్షయ్‌రెడ్డి కారులో ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

ప్రయాణిస్తున్న లక్ష్మి, భూమవ్వ, రాజేశ్వర్‌రెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానికులు కామా రెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ లక్ష్మి మృ తి చెందింది. రోడ్డు ప్రమాదానికి కారణమైన ట్రాలీ లారీ డ్రైవర్ వెంటనే తన వాహనంతో పారిపో యాడు. పోలీసులు వెంబండించి లారీని పట్టు కున్నారు. అక్షయ్‌రెడ్డి తాత సంగారెడ్డి గతం లో బాన్సువాడ సర్పంచ్‌గా పనిచేశాడు. సం గారెడ్డి కుమార్తె అయిన లక్ష్మిని కొండల్‌వా డికి చెందిన నర్సింహారెడ్డికి ఇచ్చి వివాహం చేయగా వారికి అక్షయ్‌రెడ్డి జన్మించాడు. వీరు బాన్సువాడలో ఉండగా అక్షయ్‌రెడ్డికి





మృతి చెందిన లక్ష్మి(ఫైల్) అక్షయ్‌రెడ్డి(ఫైల్)

ఉద్యోగం రావడంతో హైదరాబాద్‌లోని అంబారిపే టలో నివాసం ఉంటున్నారు. ఘటన స్థలాన్ని భిక్కనూరు ఎస్సై సాయికుమార్ సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. ప్రమాదం లో మృతిచెందిన, గాయపడ్డ వారి వద్ద ఉన్న బం గారు ఆభరణాలు, సెల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను పోలీసులు కుటుంబీ కులకు అందజేశారు.





ప్రమాదంలో గాయపడ్డ భూమవ్వ, రాజేశ్వర్‌రెడ్డి

న్యాయవాదిపై దాడి కేసులో హైకోర్టులో క్వాష్ పిటిషన్


ఖలీల్‌వాడి: న్యాయవాది మహమ్మద్ ఖలీద్ రహమాన్‌పై దాడికి పాల్పడిన వ్యక్తులు కేసును తొలగించాలని హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. జిల్లా కేంద్రంలోని ఖిల్లారోడ్డులోని న్యాయ వాదికి చెందిన షెటర్‌ను తమకే విక్రయించాలని అదే ప్రాంతానికి చెందిన హర్షద్‌ఖాన్ అడిగితే అమ్మ నందుకు ముజఫర్‌ఖాన్, మజీద్‌ఖాన్ గత నెల 24న న్యాయవాది మహమ్మద్ ఖలీద్ రహమాన్‌పై దాడికి పాల్పడ్డారు. దీంతో నిందితులపై రెండో టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా దాడికి పాల్పడిన హర్షద్‌ఖాన్, ముజఫర్‌ఖాన్, మజీద్‌ఖాన్ పరారీలో ఉన్నారు. వీరిని పట్టుకునేందుకు పోలీ సులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అయితే ఈనెల 4న హర్షద్‌ఖాన్ కేసును కొట్టే యాలని హైకోర్టులో క్వాష్ పిటిషన్ దఖలు చేయ డంతో సోమవారం హైకోర్టులో బెంచ్‌పైకి రానున్న ది. దీంతో కేసుకు సంబంధించిన వివరాలను పోలీ సులు హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయాల్సి ఉం టుంది. పోలీసులు దాఖలు చేసిన కౌంటర్ ఆధారం గా కేసుపై తీర్పు వచ్చే అవకాశాలు ఉన్నాయి. న్యాయవాదిపై దాడికి పాల్పడిన వారిని పోలీసులు అరెస్ట్ చేయకుండా జాప్యం చేస్తుండడంపై రాజ కీయ నాయకుల హస్తం ఉందనే ప్రచారం నగరం లో వినిపిస్తోంది. న్యాయవాదిపై దాడి చేస్తేనే పట్టిం చుకుని పోలీసులు సామాన్య ప్రజలకు ఎలాంటి న్యాయం చేస్తారనే చర్చ జరుగుతోంది. ఇకనైనా పోలీసులు హైకోర్టులో క్వాష్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేసి న్యాయవాదికి న్యాయం చేయాలని నగరప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎస్సై యాసిన్ అరాఫత్‌ను వివరణ కోరగా క్వాష్ పిటిష న్‌పై కౌంటర్ దాఖలు చేస్తామని తెలిపారు.

తాడ్‌బిలోలిలో స్కూటీ చోరీ

రెంజల్: మండలంలోని తాడ్‌బిలోలిలో ఓ ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన స్కూటీని దుండగులు శని వారం రాత్రి చోరీ చేశారు. గ్రామానికి చెందిన దయాకర్‌రెడ్డి శనివారం సాయంత్రం ఇంటి ఎదుట స్కూటీని పార్కింగ్ చేసి ఇంట్లోకి వెళ్లగా రాత్రి చోరీకి గురైంది. గ్రామంలోని సీసీ పుటేజీలను పరిశీ లించగా గుర్తుతెలియని యువకులు రెక్కీ నిర్వహిం చి బోర్గాం మీదుగా వాహనాన్ని తీసుకెళ్లినట్లు గుర్తిం చారు. బాధితుడు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేష న్‌లో ఫిర్యాదు చేశారు.

వన్నెల్(బి)లో మహిళ దారుణ హత్య

- నిద్రిస్తుండగా గొడ్డలితో వేటు
- భర్తే హతమార్చినట్లు పోలీసుల అనుమానం



శివకళ మృతదేహం

బాల్కొండ: మండలంలోని వన్నెల్(బి)లో ఓ వివాహిత దారుణ హత్యకు గురైంది. ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బిలోలి తాలుక బెల్లకొని గ్రామానికి చెందిన రాజగంగారాం భార్య జంగం శివక ళ(33)తో కలిసి మూడేళ్ల క్రితం వన్నెల్(బి)కి ఉపాధి కోసం వచ్చారు. గ్రామంలో కలిగోట్ దేవేం దర్ అనే వ్యక్తి వద్ద వ్యవసాయ పనులకు జీతం ఉన్నారు. రాజగంగారాం మద్యానికి బానిసై వ్యవ సాయ పనులకు వెళ్లకుండా భార్యను వేధించేవాడు. తన భర్త మద్యం మానేందు కోసం శివకళ రెండు రోజుల క్రితం ఇతర ప్రాంతాల్లో మందులు పోయించింది. దీంతో ఆమెపై కోపం పెంచుకున్న అతను శనివారం ఉదయం నుంచి గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఆరు గంటలు దాటినా శివకళ పాలకోసం ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన యజమాని దేవేందర్ కుటుం బ సభ్యులు ఇంట్లోకి వెళ్లి చూశారు. ఆమె మంచం పై విగతజీవిగా ఉండడంతో పోలీసులకు సమా చారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరు కొని వివరాలు సేకరించారు. ఆమె నిద్రలో ఉండ గానే గొడ్డలితో తలపై బాది హత్య జరిగి ఉంటుం దని పోలీసులు తెలిపారు.

భర్తే హంతకుడా..?

గ్రామానికి ఉపాధి కోసం వచ్చిన రాజగంగారాం శివకళ దంపతులు ఇద్దరే ఓ ఇంట్లో నివాసం ఉం టున్నారు. రెండు రోజులుగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో కోపంలోనే భర్త ఆమెను హత్య చేసి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాజగంగారాం పరారీలో ఉన్నాడు. హత్య విషయం తెలుసుకున్న ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. త్వరలో కేసును చేదించి నిందితుడిని పట్టుకుంటామన్నారు. ఆయన వెంట ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై నరేశ్, సిబ్బంది ఉన్నారు.

మిర్చి కంపౌండ్‌లో మరొకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని మిర్చి కంపౌండ్ ప్రాం తంలో ఒకరి హత్య జరిగినట్లు ఎస్‌హెచ్‌వో రఘు పతి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మహారా ష్ట్రలోని నాందేడ్‌కు చెందిన షేక్ యూసుఫ్(50) ప్రతి రోజు పట్టణంలో తిరుగుతూ రాత్రి మిర్చి కంపౌండ్ ప్రాంతంలోని పాత ఇనుప సామాగ్రి దుకాణం వద్ద పడుకుంటాడు. శని వారం అర్ధరా త్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తి యూసుఫ్ గొంతుపై బలమైన గాయం చేయడంతో రక్తం కా రి మృతి చెందాడు. దుకాణ యజమాని నజీర్ అహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

చీటీ వ్యాపారి అదృశ్యం?

ఆర్మూర్‌టౌన్: వ్యాపారాల్లో దివాల తీయడం, ఐపీ(ఇన్‌సాల్‌వెన్సి పిటిషన్) పెట్టడం పరిపాటిగా మారింది. కొందరు వ్యాపారాల్లో నష్టపోయి చేసిన అప్పులను తీర్చలేక కోర్టును ఆశ్రయిస్తే మరికొం దరు అప్పులు తీర్చే స్తోమత ఉన్నా డబ్బుల ఎగవే తకు ఐపీలు పెడుతున్నారు. ఆలూర్ మండలం మ చ్చర్ల గ్రామానికి చెందిన ఓ చీటీ వ్యాపారి గత 15 రోజులుగా కనిపించడం లేదు. దీంతో చీటీ సభ్యు లు ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది. సదరు వ్యాపారి గ్రామంలో మిత్రులు, బంధువులు, పరిచ యస్తుల నుంచి చీటీలు వేయించాడు. సభ్యులకు చీటీ డబ్బులు చెల్లించకపోగా గ్రామం నుంచి కన బడకుండా పోవడం చర్చనీయంగా మారింది.

రామేశ్వర్‌పల్లిలో..

కామారెడ్డి క్రైం: మున్సిపల్ పరిధిలోని రామేశ్వర్‌ప ల్లి గ్రామానికి చెందిన జ్యోతి మహిళ అదృశ్యమై నట్లు దేవునిపల్లి ఎస్సై రాజు ఆదివారం తెలిపారు. ఈ నెల 7న ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. కుటుంబీకుల ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.